www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 జులై 2024



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - కడప : ప్రతి ఒక్కరూ నాలుగు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ కె. మురళీమోహన్ అన్నారు. శుక్రవారం బాలికల బడిని పక్కన కెనరా బ్యాంకు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. కోసం ప్రతి ఒక్క వ్యక్తి నాలుగు మొక్కలు నాటలని సూచించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, అరెసెట్ డైరెక్టర్ ఆరిఫ్, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఆర్ఎం

వంటింట్లో ధరల మంట

సామాన్యులపై భారం - రెట్టింపైన కూరగాయల ధరలు
ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలపై ప్రభావం

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

వంటింట్లో వాడే కూరగాయల ధరలు సామాన్యునికి మంట పుట్టిస్తున్నాయి. రెట్టింపు పైన ధరల ప్రభావం ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలపై ప్రభావం చూపుతున్నాయి. కూరగాయల ధరలు కొండెక్కాయి. 50 శాతం ధరలు పెరగడంతో సామాన్యులు కొనలేని స్థితికి చేరారు. ప్రస్తుత ఆకాల వర్షాల కారణంగా కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ కారణంగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో ధరల పెరుగుదల అనివార్యమైంది. ప్రస్తుతం అన్ని కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. రెండు వారాల నుంచి పెరుగుదలలో వ్యత్యాసం కనిపిస్తుంది. ఉత్పత్తి తగ్గిపోవడం, రవాణా నిలిచిపోవడం, కొందరు కృత్రిమ కొరతను సృష్టించడం వంటి కారణాలు కూరగాయల ధరలు పెరగడానికి కారణ మవుతున్నాయి. ఒంద వారాల నుంచి ధరలు బాగా పెరిగాయి. వంకాయలు రూ.40 నుంచి రూ.80, బీర రూ.40 నుంచి రూ.60, బెండ రూ.40 నుంచి రూ.60, చిక్కుళ్ళు రూ.40 నుంచి రూ.60, దొండ రూ.60 నుంచి రూ.80, క్యాబేజీ రూ.30 నుంచి రూ.50, కాకర రూ.50 నుంచి రూ. 70, టమోటా రూ.30 నుంచి రూ.60, బంగాళా దుంపలు రూ.30 నుంచి రూ.60, మునక్కాడ ఒకటి రూ.5 నుంచి 10, బీట్రూట్ రూ. 40 నుంచి రూ.80కి పెరిగాయి. కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు.

జీతం సరిపోవడం లేదు

కూరగాయలు పెరగడంతో వచ్చే జీతం చాలడం లేదు. నెలకు రూ. 12 వేల జీతం వస్తే తినడానికి సరిపోతుంది. ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తుంది.

- హసీనా, చిరుద్యోగి, పులివెందుల.

అప్పు చేయాల్సి వస్తుంది

మార్కెట్కు పోతే కూరగాయలకే రూ. 500 అవుతుందని, దీనికి తోడు నిత్యావసర సరుకుల ఆకాశానంటుతున్నాయి. కూలి పనులు కూడా దొరకడం లేదు. జీవనం సాగించడానికి అప్పు చేయాల్సి వస్తుంది.

-గంగమ్మ, వ్యవసాయ కూలీ, పులివెందుల.

రైతు బజార్ ఏర్పాటు చేయాలి

రైతుబజార్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకు కూరగాయలు అందిస్తే సామాన్య ప్రజలకు కొంతవరకు ఊరట కలుగుతుంది. అధికారులు చర్యలు తీసుకుని రైతు బజార్ ఏర్పాటుచేస్తే రైతులు తమ పంటను అమ్ముకోవడానికి సౌకర్యంగా ఉంటుంది.

-ఉమాదేవి, గృహిణి, పులివెందుల.



మరింత పెరిగే అవకాశం

పట్టణంలో రైతు బజారులు లేకపోవడంతో దుకాణాలలో కూరగాయల ధరలు కాక పుట్టిస్తున్నాయి. దాదాపు అన్ని రకాల ధరలు మండి పోతున్నాయి. ఇటీవల కురిసిన ఆకాల వర్షాలకు తోటలు పాడవడంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఏ కూరగాయ రేటు చూసినా కిలో రూ.60 పైగానే ఉంది. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కూరగాయలను కొనేందుకు జంకుతున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కూరగాయలు లేకుండా పూట గడవని పరిస్థితిలో వాటి ధరలు ఆకాశాన్నంటడంతో కిలో కొనాలనుకున్న వారు అర కిలోతో సరిపెట్టుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

ఘాటెక్కిన ఉల్లి, టమోటా ధరలు

శాకాహారమైనా, మాంసాహారమైనా ప్రతి ఇంట్లో ఉల్లి, టమోట తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో ఉల్లి, టమోటాకి డిమాండ్ బాగా పెరిగింది. మనకు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచే ఉల్లిపాయలు వస్తున్నాయి. ఇక్కడ రబీలో వేసే ఉల్లి పంటలు ఆకాల వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో 50 శాతం వరకూ దిగుబడులు తగ్గిపోవడంతో ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గత నెల కిలో రూ.20 నుంచి రూ.25 మధ్య ఉండగా ఒక్కసారిగా రూ.50కు చేరుకుంది. గ్రేడింగును బట్టి ధరల నిర్ణయిస్తున్నారు. రెండో రకం ఉల్లి రూ.35 ఉండగా మొదటి రకం ధర రూ.50 వర కూ ఉంది. అలాగే టమోటా ధర కిలో గత నెలలో రూ. 30 లు ఉండగా రూ 60కి చేరింది ఇవి మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీలపై అదనపు భారం

ప్రభుత్వ మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల్లో నిత్యం ఉదయం అల్పాహారంగా ఉడికించిన కోడి గుడ్డు, సోమవారం నుంచి శనివారం వరకు అన్నం, పులిహోర, ఎగ్ ఫ్రైడ్ రైస్, వెజిటబుల్ రైస్, దోసకాయ, టమోటా, ఆకుకూర, బీరకాయ, సొరకాయ, మునగాకు, పాలకూర, పప్పు కూరగాయలతోపాటు సాంబారు ఇవ్వాలి. బియ్యం, పప్పులు, ఆయిల్ ప్రభుత్వమే అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తుంది. అయితే కూరగాయలు, తాలింపు సామాన్లు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి పోవడంతో అంగన్వాడీలపై ఆదనపు భారం తప్పడం లేదు. అలాగే ప్రభుత్వ వసతి గృహాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ఛార్జీలు సరిపోని పరిస్థితుల్లో ఎస్సి, ఎస్టి, బిసి విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించలేదని వార్డెన్లు సతమతమవుతున్నారు. మరోవైపు కూరగాయల ధరలు రెట్టింపు కావడంతో సంక్షేమ విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు గురవుతున్నారు. కొన్నిచోట్ల చేసేదేమీ లేక కూరల్లో నాణ్యత తగ్గిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 0.4 డిమాండ్ పెరగడం, మార్కెట్లకు సరుకు అంతంత మాత్రంగానే వస్తుండడంతో ధరల్ని పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. వీటి ప్రభావంతో వ్యాపారాలు అంతంత మాత్రంగానే నడుస్తున్నాయని వాపోతున్నారు. కొత్త పంట మార్కెట్కు వచ్చే వరకూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని చెబుతున్నారు.

పోష్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో పోష్ -2013 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిఆర్ఓ గంగాధర్ గౌడ్ అధికారులను సూచించారు. శుక్రవారం గ్రీవెన్స్ హాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్ అట్ వర్క్ ప్లేస్ (పోష్ ఆక్ట్-2013)పై శిక్షణ కార్యక్రమం డిఆర్ఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల పై పోష్ చట్టం రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఈ చట్టంపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో లోకల్ కంప్లైంట్ కమిటీని(ఎల్సిసి) ఏర్పాటు చేశామని చెప్పారు. కమిటీకి చైర్ పర్సన్గా స్పెషల్ కలెక్టర్ కౌసర్ భాను, కన్వీనర్గా ఐసిడిసి పీడీ శ్రీలక్ష్మి వ్యవహరిస్తారని, ఇద్దరు ఇతర సభ్యులు ఎక్స్ఆఫిషియో సభ్యులు ఉంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ (ఆర్గనైజ్డ్,అనార్గనైజ్డ్) సంస్థల్లో పని చేస్తున్న ప్రతి మహిళకు ఈ చట్టం వర్తిస్తుందని తెలిపారు. పదిమంది పైగా ఉద్యోగులు పనిచేసే ప్రతి ప్రభుత్వ సంస్థల్లో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ (ఐసిసి)ని చైర్ పర్సన్ ముగ్గురు సభ్యులతో తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. పదిమంది కంటే తక్కువ పని చేసే సంస్థల్లో ఎవరైనా మహిళలు వేధింపులకు గురైతే మున్సిపాల్టీ స్థాయిలో మున్సిపల్ కమిషనర్ కు, మండల స్థాయిలో తహాశీల్దార్కు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత వ్యక్తికి ఏడు రోజుల లోపల నోటీసు ఇచ్చి 90 రోజుల్లో విచారణ పూర్తి చేసి లోకల్ కంప్లైంట్ కమిటీకి రిపోర్టు పంపించాలని తెలిపారు. ఇందుకు సంబంధించి బాధిత మహిళ వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. .పోష్ ఆక్ట్ కన్వీనర్ ఐసిడిఎస్ పీడీ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ1997 సంవత్సరలో రాజస్థాన్లోని భన్వారీ దేవి అనే మహిళా ఉద్యోగి లైంగిక వేధింపులకు గురైన నేపథ్యంలో సుప్రీంకోర్టు పోష్ ఆక్ట్ 2013 మార్గదర్శకాలు రూపొందించారని చెప్పారు. పోష్ యాక్ట్పై ఏవైనా సందేహాలు ఇబ్బందులు ఉన్న ఐసిడిఎస్ అడ్వకేట్లను సంప్రదించవచ్చునని తెలిపారు. అలాగే చిన్నపిల్లల సమస్యలపై 1098 మహిళల సమస్యలపై 181, 112 టోల్ ఫ్రీ నెంబర్లకు కూడా ఫోన్ చేసి సమస్యలను తెలియపరచవచ్చునని అన్నారు. శిక్షణ కార్యక్రమం అనంతరం డిఆర్ఓ గంగాధర్ గౌడ్ చేతులమీదుగా పోష్ చట్టం-2013 పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో దిశా డిఎస్పి రమాకాంత్, కడప ఇన్ఛార్జి ఆర్డిఓ వెంకటపతి, జమ్మలమడుగు ఆర్డిఓ శ్రీనివాసులు, విద్యా శాఖ అధికారి అనురాధ, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, అడా వైస్ చైర్మన్ నందన్, డిఆర్డిఎ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్, బీసీ వెల్ఫేర్ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, ఇతర జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిఆర్ఓ గంగాధర్గౌడ్

కార్మిక నాయకులపై దాడి దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి కడప అర్బన్

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కార్మిక నాయకులపై దాడికి పాల్పడిన ప్రశాంత్ను అరెస్టు చేసి, కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బులు కాజేసి, అత్యంత అవినీతికి పాల్పడుతున్న శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ను తక్షణం సస్పెండ్ చేయాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు పి. చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రొద్దుటూరులో ఎన్నికైనటువంటి ప్రజా ప్రతినిధులు ఎవరి పని వారు చేయాలనే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ ఆదేశాలు అవినీతి ప్రసాద్కు, వారి కుమారుడైన ప్రశాంత్కు వర్తించలేదని పేర్కొన్నారు. వారి అవినీతికి అవకాశాలు లేకుండా పోతుందనే భయంతో కార్మిక నాయకులపై దాడులకు పాల్పడడం దుర్మార్గమని తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటిలో ప్రసాద్ అంటే అవినీతి కేరాఫ్ అంటున్నారని ఆరోపించారు. ప్రసాదు, వారి కుమారుడు ప్రశాంత్ ప్రొద్దుటూరు మున్సిపాలిటీని శాసిస్తున్నారని చెప్పారు. కార్మికుల సమస్యలపై కార్మిక నాయకులు అడిగితే, ప్రశ్నిస్తే ప్రసాద్ బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మున్సిపల్ కార్మిక నాయకులు పైన వారి కుమారుడు ప్రశాంత్ మరి కొందరి ద్వారా దాడి చేశారని తెలిపారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. గతంలో ఈయన చేసిన అవినీతిపై జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేసి జిల్లా అధికారులకు వినతిపత్రం ఇచ్చామని గుర్తుచేశారు. తక్షణం దాడికి పాల్పడిన ప్రశాంత్ను అరెస్టు చేసి, అవినీతికి పాల్పడుతున్న శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

డయేరియాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

డయేరియాను అరికట్టలేని దద్దమ్మ ప్రభుత్వంగా టిడిపి తయారైందని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా వ్యాధి రోజు రోజుకూ అధికమవుతున్నప్పటికీ అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోక పోవడం దారుణం అన్నారు. డయేరియాతో ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్యం పడకేసిందన్నారు. చెత్త సంపద కేంద్రాలు దరిద్ర కేంద్రాలుగా తయారైనట్లు చెప్పారు. డయేరియాను అరికట్టేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లికి వందనంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని టిడిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు చెప్పారు. కాని ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 29లో పాఠశాలకు పంపే ప్రతి తల్లికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని పేర్కొన్నడం గర్హనీయం అన్నారు. జీవో ప్రకారం చూస్తే ఒక తల్లికి ముగ్గురు బిడ్డ లున్నా ఏడాదికి రూ 15 వేలు మాత్రమే వస్తుందన్నారు. ఇది మాట తప్పడం అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ 29ని సవరించి ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు తల్లి ఖాతాల్లో వేస్తామని స్పష్టత ఇవ్వాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని సూచించారు.

విద్యుత్ శాఖ మంత్రికి యుఇఇయు, సిఐటియు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని యుఇఇ యు, సిఐటియు నాయకులు కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ను యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సుదర్శన్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనువాసులురెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కలిశారు. సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సావధానంగా అన్ని విషయాలు చర్చించారు. త్వరగా సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ డిస్కాం ప్రెసిడెంట్ యన్. శివశంకర్, రాష్ట్ర నాయకులు నాయబ్ రసూల్, వెంకటేశ్వరరావు, పెంచల ప్రసాద్, కోశాధికారి ఎల్.రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగ సుబ్బయ్య, సురేంద్రబాబు, నాగమల్లయ్య, ఎనర్జీ సెక్రెటరీ నాయకులు రసూల్, సునీల్, ప్రసన్న పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఓ షకిలాబేగం, వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర, ఇఓపిఆర్డి శ్రీధర్, ఎంఇఓ వెంకట రామిరెడ్డి,ఆర్డబ్ల్యుఎస్ సహాయ ఇంజనీర్ స్వాతి శుక్రవారం నాడు మండలంలోని కొలుములపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ ఈ సందర్భంగా వారు సీజనల్ వ్యాధులు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఎక్కడపడితే అక్కడ టెంకాయచిప్పలు, కాఫీ కప్పులు, పాత టైర్లు, పారవేయడం వల్ల అందులో వర్షపు నీరు చేరి దోమలకు ఆవాసాలుగా మారుతాయని చెప్పారు. పాతకూలర్లు, పూలకుండీలు, పాత రోళ్ళు, మురుగు కుంటలు కూడా వ్యాధులను పెంపొందిస్తాయని చెప్పారు. ఈగలు కూడా ఇదే కాలంలో అధికం అవుతాయని, అవి మురుగు మీద నుంచి మనం తినే ఆహార పదార్థాలపై వాలడంవల్ల అంటువ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. క్రిములు మనశరీరం లోనికి వెళ్లి మనకు వాంతులు విరోచనాలు కారణమవుతాయని అందువల్ల ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజారోగ్య అధికారి సుకుమారన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళీ, ఇతర ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నారాయణ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'జెబివిఎస్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్




ప్రశంసా పత్రం అందజేస్తున్న నెహ్రూ యువ కేంద్ర అధికారి మణికంఠ

రక్తదానంలో జెబివిఎస్ సంస్థ సేవలు అభినందనీయమని నెహ్రూ యువ కేంద్ర అధికారి మణికంఠ అన్నారు. శుక్రవారం నగరంలో జెబివిఎస్ చేస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ఇపటి వరకు ప్రాజెక్ట్ ఔషధ సమర్పణతో వివిధ రక్తదన శిబిరాల్లో అత్యవసర, అస్వస్థత పరిస్థితిలో ఉన్నవారికి ఫిబ్రవరి నుంచి జూన్ వరకు రిమ్స్ రక్తనిధి కేంద్రానికి 1029 యూనిట్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రానికి 391యూనిట్లు రక్తదానం చేశారు. సేవలను గుర్తిస్తూ నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠ చేతుల మీదుగా జెబివిఎస్ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అశోక్ను రెడ్ క్రాస్ సొసైటీ శివశంకర్ రెడ్డి, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ కలిసి ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ భారతదేశంలోని యువతని ప్రోత్సహించి నవ భారతాన్ని నిర్మించే దిశగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఎన్వైకే వాలంటీర్లు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సి ధ్రువీకరణ పత్రాలివ్వాలి

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న పస్తం అంజి

బేడ బుడగ జంగం కులస్తులకు ఎస్సి సర్టిఫికెట్ మంజూరు చేయాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి ప్రభుత్వాన్ని కోరారు. కుల సర్టిఫికెట్ లేక బేడ బుడగ జంగం కులస్తుల పిల్లలు ప్రభుత్వ పథకాలు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ ప్రభుత్వమైనా బేడ బుడగ జంగం కులస్తులకు ఎస్సి సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి బేడా బుడగ జంగం కులస్తులకు ఎస్సి సర్టిఫికెట్లు లేవని, ఈ విషయాన్ని 2018న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఉండవలిలో మహాసభ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. అప్పట్లో జెసి శర్మ కమిషనర్ వేశారని, ఆయన రాష్ట్రమంతా తిరిగి బుడగ జంగం వారికీ ఎస్సి సర్టిఫికెట్లు ఇవ్వొచ్చని ప్రభుత్వానికి రిపోర్టు కూడా ఇచ్చారన్నారు. తరువాత పట్టించుకోలేదని, వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్రెడ్డి కూడా ఈ విషయం తెలిపామని చెప్పారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిందని బేడ బుడగ జంగం కులస్తులకు ఎస్సి సర్టిఫికెట్ వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో డి రాముడు, పి ఆంజనేయులు, సి. వెంకటయ్య, కె. లక్షమయ్య పాల్గొన్నారు.

న్యాయ సాయమే పాన్ ఇండియా ఉద్దేశం

ప్రజాశక్తి - కడప : జైల్లో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడమే పాన్ ఇండియా ప్రచారం -2024 ముఖ్య ఉద్దేశమని ట్రైనీ న్యాయమూర్తులు ఎం. చంద్రశేఖర్ రెడ్డి, కంది సురేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కడప నగరంలోని మహిళా కారాగారాన్ని వారు సందర్శించి అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రచారం -2024 కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లల్లో నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత న్యాయం, రక్షణ సలహా వ్యవస్థ, పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు.

ప్రజా సంక్షేమమే చంద్రన్న లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని కడప నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి పేర్కొన్నారు. వినియోగదారులకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అందించే విధంగా నగరంలోని బిజీ వేముల వీరారెడ్డి రైతు బజార్లో శుక్రవారం ఆమె సోనా మసూరి బియ్యం కిలో రూ.48. కందిపప్పు కిలో రూ.160 విక్రయించే కౌంటర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో జగన్రెడ్డి ఐదేళ్ల బటన్ నొక్కి నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెంచారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి, వినియోగదారులకు అందించే సద్దుదేశంతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ద్వారా వస్తువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పొలిటి బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చెట్లు జీవన గమనానికి మెట్లు : డిఎఫ్ఓ

ప్రజాశక్తి - కడప అర్బన్



క్షేత్ర సందర్శనలో శిక్షకులు

చెట్లు మానవుని జీవనగమనానికి మెట్లు అని డిఎఫ్ఓ సందీప్రెడ్డి అన్నారు. శుక్రవారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్, కడపలో అడవులకు వెలుప ఉన్న చెట్లు, వ్యవసాయ అటవీ పద్ధతులను అవలంభించే విధానంపై రైతులు, చెట్లు పెంపకదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగ్రోఫారెస్ట్రీ పద్ధతుల వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దేశంలో అడవులకు వెలుపల ఉన్న చెట్లు ఆదాయం సృష్టించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రపంచ వాతావరణ సంక్షోభాన్ని తగ్గిస్తుందన్నారు. నాబార్డ్ ఎజిఎం బి.విజయ విహారి మాట్లాడుతూ అగ్రోఫారెస్ట్రీ పద్ధతుల ద్వారా రైతులు ఆర్థిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్బన్ క్రెడిట్లు రైతులకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. శిక్షణలో 90 మంది భాగస్వాములు అయ్యారు. వీరిని క్షేత్ర సందర్శనకు తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టిఓఎఫ్ఐ బృందం రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎ.అజిత్ చోనచలం, అసోసియేట్ కె.సతీష్, కె.వి.జయంత్, డి.ప్రవీణ్ పాల్గొన్నారు.

కెవికెను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం ప్రొద్దుటూరు చెందిన గోపికృష్ణ అంతర్జాతీయ స్కూల్, కడపకు చెందిన నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు దాదాపు 59 మంది కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలు, సాంకేతికత పరిజ్ఞాన వ్యాప్తికి కెవికె అవలంబిస్తున్న విస్తరణ పద్ధతుల గురించి వివరించారు. అనంతరం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ బాబు సమాచార కేంద్రంలో గల వివిధ నమూనాలను, చార్ట్, పోస్టర్స్ ప్రత్యక్ష మోడల్స్ను విద్యార్థులకు చూపించి వారికి అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, సాయి మహేశ్వరి, జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పథక సంచాలకులు విద్యార్థులకు విలువ జోడింపు, పంటలలో వచ్చే చీడపీడలు, వ్యవసాయ పంటల గురించి క్లుప్తంగా వివరించారు.

ఘనంగా పేపర్ సంచుల దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్సిసి ఆధ్వర్యంలో ప్రపంచ పేపర్ సంచుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాష మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పేపర్, జూట్ బ్యాగుల మంచివని తెలిపారు. ప్లాస్టిక్ బ్యాగ్లు వాడవద్దని కోరారు. జూట్ బ్యాగుల తయారీ సంస్థ వ్యవస్థాపకులు భవాని మాట్లాడుతూ కెనరా బ్యాంక్ వారి సహాయంతో స్వయం ఉపాధి సంస్థ స్థాపించానని చెప్పారు. అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గురివిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయలక్ష్మిదేవి, డాక్టర్ శచీదేవి, ఎసిసి అధికారి డాక్టర్ బి.స్వరూప, ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ గురుమోహన్రెడ్డి, రవిశేఖర్రెడ్డి, నాగవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చైతన్యరెడ్డికి, పుత్తా నరసింహారెడ్డికి స్వాగతం పలుకుతున్న అధికారులు

కొప్పర్తికి పరిశ్రమలు తీసుకువస్తాం
- కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె

రానున్న రోజుల్లో కొప్పర్తి పారిశ్రామిక వాడకు పరిశ్రమలు తీసుకొస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డితో కలిసి కొప్పర్తి పారిశ్రామిక వాడలో డిక్సన్ కంపెనీ వారు తయారు చేస్తున్న సిసి కెమెరాల డెమో ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటి మినిస్టర్ నారా లోకేష్ సహకారంతో మంచి ఇండస్ట్రియల్ హబ్గా మారుస్తానని పేర్కొన్నారు. చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం తరపున వచ్చే రాయితీలను త్వరగా వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇండస్ట్రియల్ పరిధిలో రాత్రిపూట పోలీస్ పికెటింగ్ కావాలని కంపెనీ వారు కోరగా అక్కడనుండే ఎస్పితో మాట్లాడి గస్తీ ఏర్పాటు చేయించారు. అంతకుముందు ఇండస్ట్రియల్ అధికారులు పారిశ్రామిక ప్రగతిని వారికి వివరించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు లక్ష్మిరెడ్డి, కొప్పర్తి సర్పంచ్ కోగటం సుజాతమ్మ ,అధికారులు జగదీష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎపి రజక సంఘం ఉపాధ్యక్షులుగా కృష్ణమూరి

ప్రజాశక్తి - కడప



కడప జిల్లా రజక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గా పనిచేస్తున్న సి. కృష్ణమూర్తిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ శుక్రవారం రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. కాశయ్య ఉత్తర్వులు జారీ చేశారు. కడప జిల్లా రజక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్గా రజకులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడూ అడిగి తెలుసుకుంటూ పరిష్కారం కోసం సి. కృష్ణమూర్తి పని చేసేవారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర రజక సంఘం అధ్యక్షులు పి. కాశయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సి. కృష్ణమూర్తి మాట్లాడుతూ తనకు రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు పన్నీటి కాశయ్య, జిల్లా అధ్యక్షులు చేలో రవి, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో రజక సంఘం అభివృద్ధి కోసం తన శాయశక్తుల పనిచేయడమే కాకుండా రజకుల సమస్యలపై పోరాటం సాగిస్తానని తెలిపారు.

ముగిసిన వైవీయూ పీజీ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ అనుబంధ కళాశాలలో జూన్ 28 నుంచి నిర్వహిస్తున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. విశ్వవిద్యాలయంలోని 29 శాఖల విద్యార్థులు 2,4 సెమిస్టర్ పరీక్షలు రాశారు. చివరి రోజు వైవీయూ ఆర్ట్స్ బ్లాక్లో పరీక్షా కేంద్రాన్ని వైవీయూ రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు.



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

డిప్లొమా ఫలితాలలో 'గౌతమి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గౌతమి మహిళ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఎస్‌బి టెట్ విజయవాడ వారు విడుదల చేసిన పాలిటెక్నిక్ మొదటి సంవత్సర ఫలితాలలో ఉత్తమ ఫలితాలను సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్ రావు తెలిపారు. శుక్రవారం ప్రొద్దుటూరు దగ్గరలోని పెద్ద శెట్టిపల్లి గ్రామం వద్ద ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం డిజైన విభాగానికి చెందిన వి. పూజ 98.09 , పి మని యామిని 97.09 , టి. మౌనిక 96.10 శాతం సాధించారని తెలిపారు. అలాగే డిసిఎంఇ విభాగంలో సంగీత 95.7, మస్తాన్‌బీ 95.3, నందిని 94.5, డి.ఈ ఈ ఈ విభాగంలో దివ్య నయన 91.1 శాతం సాధించారని పేర్కొన్నారు. వీరితో పాటు 25 మంది విద్యార్థులు 90 శాతం పైగా సాధించారని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ కె.సి. బాబయ్య, డైరెక్టర్ నాగరాజు, రవీంద్ర రెడ్డి, కార్యదర్శి తెలుగు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. రామసుబ్బయ్య, వివిధ విభాగ అధిపతులు మహమ్మద్ జాబీర్, యాకూబ్ అలీ, బాలసుబ్బన్న, విజయమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

15న అతిథి అధ్యాపకుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కడప : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు, 2024-25 విద్యా సంవత్సరానికి గాను, కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల(అటానమస్)లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులు (హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, జియాలజీ-1, జువాలజీ-1) అర్హులైన అభ్యర్థులను వాక్-ఇన్ (ముఖాముఖీ) నేరుగా ఇంటర్వ్యూ కోసం ఈనెల 15న ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక నియామవళి మేరకు అర్హతలు(నెట్, సెట్, పి.హెచ్ డి) ఉన్న వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. పనిగంటల ఆధారంగా అతిథి అధ్యాపకులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను వేతనం చెల్లిస్తారని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లతో కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు మండలనాయకులు

విద్యా వ్యవస్థను కాపాడాలి

ప్రజాశక్తి-కాశినాయన

రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వచ్చిన కొత్త ప్రభుత్వమైనా విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని ఎస్‌టియు మండల కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక ఎస్‌టియు రీజన్ కార్యాలయంలో ఆ శాఖ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పాఠశాలలు అభివృద్ధి చెందలేదని, పలు పాఠశాలల్లో విద్య పరంగా తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా విద్యాశాఖ ఇంతవరకు అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయలేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు ఓపిఎస్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ,మండల నాయకులు పాల్గొన్నారు

ఇంటి పన్ను వెంటనే చెల్లించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించి అభివృద్ధి కుంటు పడకుండా ఉండాలంటే ఇంటి పన్నును వెంటనే చెల్లించాలని ఎంపిడిఒ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన పారిశుద్ధ్యం, పర్యావరణంపై విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత మండలంలో నీటి కలుషితం వల్ల సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆశ వర్కర్లు డాక్టర్ వరకు, పారిశుద్ధ్య కార్మికుల నుంచి పంచాయతీ సెక్రటరీ వరకు ఉందని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాలలో పర్యటించి పారిశుద్ధ్యం పై, విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శుక్రవారం ఆకస్మికంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు . ఈ సందర్భంగా ఎంపిడిఒ కోటేశ్వరరావు, హెచ్‌ఎం మేరీ మాలినితో మాట్లాడుతూ ప్రస్తుత వస్తున్న వర్షాల దృష్ట్యా ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి అనారోగ్యాలు రాకుండా చూసుకోవాలని అన్నారు. ప్రస్తుతం డయేరియా వ్యాధి రాకుండా, కలుషితమైన నీటిని తాగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అల్లా బకాష్ మాట్లాడుతూ నీటిని పరిశీలించి అందులో ఉన్న మినరల్ శాతాన్ని తెలియజేశారు. పాఠశాల చుట్టూ శానిటేషన్, క్లోరినేషన్ చేయించాలని తెలిపారు. వంటశాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారుకు నిప్పంటించుకుని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల మండలంలో శుక్రవారం మద్యం మత్తులో కారుకు నిప్పంటించుకుని వృద్ధి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బోగుడిపల్లి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి(80) కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తన కారులోనే వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఈ సంఘటనలో కారుతో పాటు వృద్ధుడు ప్రభాకర్‌రెడ్డి కాలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనపై పులివెందుల సిఐ వివరణ కోరగా మా దృష్టికి రాలేదని పేర్కొన్నారు. సమాచారం కోసం నమోదు చేయాల్సిన పోలీసులు పట్టించుకోలేదని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం : 'పుట్టా'

- మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఆగ్రహం
- పింఛన్ల అక్రమాలపై కఠిన చర్యలు
- రాజోలి ఆనకట్ట నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు

మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరితో కలిసి ముందుకు సాగుతామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిపి టి.లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు అందరూ సహకరించాలన్నారు. మైదుకూరు నియోజకవర్గ ప్రధాన సమస్య అయిన రాజోలి ఆనకట్ట నిర్మాణానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకు అవసరమైన నిధులు, భూసేకరణ అంశాల పట్ల అధికారులు సంబంధిత మంత్రులతో మాట్లాడామన్నారు. విత్తనాలు, ఎరువులు నాణ్యతతో ఉండాలన్నారు. గ్రామాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డయేరియా కేసులు రాకుండా చూడాలన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా ఏటి పరంబోకు భూములను గుర్తించాలన్నారు. అనర్హులైన ఫెన్షన్ దారులను గుర్తించాలని అర్హులకి మాత్రమే అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో శ్మశానాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అధికారులు వెంటనే సర్వే చేసి ఆక్రమణలను గుర్తించాలని తెలిపారు. గ్రామాలలో సర్పంచులు సిబ్బందితో ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి సమస్యలు గుర్తించాలన్నారు. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో ట్రాన్స్ ఫార్మర్లు అందివ్వాలని తెలిపారు. తాగునీటి సమస్యలపై వారంలోగా పూర్తి సమాచారం అందివాలన్నారు. సమావేశానికి అధికారులు కచ్చితంగా హాజరుకావాలని గైర్హాజరైన వారికి మెమో జారీ చేయాలన్నారు. గ్రామాలలో నెలకొన్న పలు సమస్యలపై టిడిపి నాయకులు నగరం సుధాకర్ రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, గురివి రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రహంతులయ్య, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఉపఎంపిపి శుభకరుణమ్మ, మండల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఎంపిపి టి. లక్షుమయ్య ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు సన్మానించారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి గురివిరెడ్డి, టిడిపి మండల నాయకులు నరసింహారెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి ఘనంగా సన్మానించారు.

'ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం' కథనంపై స్పందన



ప్రజాశక్తిలో కథనాన్ని చదువుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మండల సర్వసభ్య సమావేశానికి మొదటిసారిగా హాజరవుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు 'సమస్యల స్వాగతం' అనే శీర్షికను ప్రజాశక్తి శుక్రవారం ప్రచురితం చేసినది. ఈ కథనంపై ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ స్పందించారు. తమ సిబ్బందితో పత్రికా కథనానికి సంబంధించిన క్లిప్పింగ్‌ను తెప్పించుకుని పూర్తిగా చదివారు. కథనంలోని ప్రధాన సమస్యలైనా గ్రామాలలో తాగునీరు, ప్రధాన రహదారులు, డ్రెయినేజీలు, తదితర అంశాలను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాజోలి ఆనకట్ట నిర్మాణం కుందూలో పూడికతీత పనులు కరకట్టల నిర్మాణం చేపడతామన్నారు. సమస్యలపై నిత్యం స్పందిస్తామని, అధికారులు కూడా ఎప్పటికప్పుడూ పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు కూడా తన దృష్టికి సమస్యలు తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి తమ ధ్యేయమని తెలిపారు.

అంధకారంలో రైల్వేస్టేషన్ రోడ్డు

వెలగని విద్యుత్ దీపాలు
అవస్థల్లో వాహనదారులు, ప్రయాణికులు


వెలగని వీధిలైట్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వే స్టేషన్ నుంచి కడప బై పాస్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు (బటర్ ప్లై లైట్లు) వెలగక రాత్రి వేళల్లో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రయాణం చేసే వారు, వాహనదారులు కడప బైపాస్ నుంచి రైల్వేస్టేషన్‌కు రాక పోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డులో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి బటర్‌ప్లై లైట్లు ఏర్పాటు చేశారు. దీపాలు వెలగక పోవడంతో రోడ్డు అంధకారంగా మారింది. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాల కోసం గుంతలు తీశారు. మట్టిని అలాగే వదిలేయడంతో మట్టి రోడ్డుపై పేరుకుపోయింది. వర్షం కురిస్తే రోడ్డుపై బురద ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో రైల్వేస్టేషన్ సమీపంలోనే సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ఉంది. రాత్రి వేళల్లో విష పురుగులు తిరుగుతుంటాయని, విద్యార్థుల సౌకర్యార్థం వార్డెన్ హాస్టల్ చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఇవి మినహా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఒక్క లైటు కూడా వెలగని దుస్థితి ఏర్పడింది. సంబంధితాధికారులు స్పందించి రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి భారవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ప్రభుత్వ బాలికల జూనియర్ కళా శాలలో ఉన్న బిసి వసతి గృహంతో పాటు సబ్ జైల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వసతి గృహంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు, వారికి భోజనం సమయానికి పెడుతున్నారా, నాణ్యమైన భోజనం అందిస్తున్నారా?, లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అలాగే సబ్ జైలులో ఖైదీలకు పెట్టే ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కలుషితం కానీ నీటిని ఉపయోగించాలని అధికారులకు సూచించారు. డయేరియా ప్రబలకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలి పారు. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారాన్ని తినాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మరియు సబ్ జైలర్ హర్షవర్ధన్ న్యాయవాది సుబ్బారావు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులు దూరం

ప్రజాశక్తి -పులివెందుల టౌన్ : దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులు దూరమవుతాయని ప్రాథమిక ఆరోగ్య సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అచ్చివెల్లిలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లడుతూ దోమ కాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంక్రమించే ప్రమాదముందని తెలిపారు. ముఖ్యంగా దోమల వ్యాప్తిని నివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా నిర్ధారించి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్త, చెదరాలను తొలగింపజేయడంతో పాటు మొక్కలు, నీటి కుండీలు, రుబ్బు రోళ్లలో ఉన్న నీటిని నిల్వలను తొలగింపచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దోమ వ్యాప్తి నివారణలో భాగంగా కదలిక లేని నీటి నిల్వలపై దోమలు గుడ్లు పెట్టి 8 నుండి 10 రోజుల లోపు దోమగా రూపాంతరం చెందుతుందని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ. శివ సౌజన్య, అరోగ్య కార్యకర్త సరస్వతి, సచివాలయం సెక్రటరీ ప్రసన్న, ఆశా కార్యకర్త భారతి పాల్గొన్నారు.

గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు : మండలంలోని అన్ని గ్రామాలలో పంచాయతీ నిధులతో ప్రజల సహాయ సహకారాలతో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సిపిఎం మండల నాయకుడు సగిలి.గురయ్య అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కలసపాడు, లింగారెడ్డి పల్లె గ్రామాలలో వరుస దొంగతనాల దృష్ట్యా పోలీసులు, గ్రామస్తులు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు అందరూ కలిసి సమీకృత భావంతో దొంగతనాల నివారణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అప్పుడే దొంగతనాలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని ఆయన తెలిపారు. గ్రామాలలో రాత్రిపూట పోలీసులు గస్తీ చేసినా తెలివిగా పోలీసులు లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అందుకే ప్రతి గ్రామ మొదటిలో, చివరిలో రెండు కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు.

స్థల ఆక్రమణపై నోటీసు జారీ

ప్రజాశక్తి - చక్రాయపేట : మండల కేంద్రంలోని చక్రా యపేటలో ప్రభుత్వ అనుమతి లేకుండా రూ. 2 కోట్ల ఆస్తి స్వాహా చేస్తున్న వారికి పంచా యతీ కార్యదర్శి గంగులయ్య శుక్రవారం నోటీసు అందజేశారు. మండల కేంద్రం నడిబొడ్డులో ఉన్న సర్వే నెంబర్ 372 బిలో 20 సెంట్ల స్థలాన్ని ముస్లిం మత పెద్దలు మసీదు నిర్మాణం కోసం ఆక్రమించుకోవడంతో ఎపి పిఆర్ యాక్టు 1994 ఎస్ఇ 58, జీవో ఎంఎస్ 188 నెంబర్ ప్రకారం ప్రభుత్వ ఆస్తిని అక్రమంగా స్వాహా చేసిన వారికి కఠినమైన శిక్షణ ఉంటుందని వారు నోటీసులో పేర్కొన్నట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. తహశీల్దార్‌కు, ఎంపిడిఒకు, పోలీసులకు, కడప కలెక్టర్‌కు ఈ విషయంపై నివేదికను అందించినట్లు పేర్కొన్నారు.

తప్పు ఎవరు చేసినా వదిలేది లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దువ్వూరు

ఎవరు తప్పు చేసినా వదిలేది లేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ తెలిపారు. శుక్రవార దువ్వూరు మండల సర్వ సభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సేవ చేసేందుకే తనను అధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించారని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన చెప్పారు. మండలంలో చాలా వరకు బోగస్ పింఛన్లున్నాయని వెంటనే వాటిని విచారణ చేసి తొలగించాలని ఆయన అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపమండల అధ్యక్షురాలు పీరు జాదా రహమ తున్నిసా, మెరువ కృష్ణయ్య, ఎంపిడిఒ సుగుణ శ్రీ , డిప్యూటీ తహశీల్దార్ అలీఖాన్, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ప్రభుత్వ, ప్రయివేట్ యాజమాన్యాలకు రోజూ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశామని మండల విద్యాశాఖాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయంలో పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, కాచి చల్లార్చిన నీరు తాగుట, హ్యాండ్ వాష్‌పై అవగాహనా కల్గించారు. డెంగీ వ్యాధి, మలేరియా, టైఫాయిడ్ మొదలగు సీజనల్ వ్యాధుల గురించి, వాటి నివారణ గురించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో ప్రతి శుక్రవారమూ డ్రైడే నిర్వహించాలని తెలియజేశారు. ఉపాధ్యాయులు తరగతి గదికి వెల్లునప్పుడు చరవాణి తీసుకొని వెళ్లరాదన్నారు.

29న కడపలో మాలమహానాడు ధర్నా

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఈనెల 29న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు ఉల్లి కిరణ్ కుమార్, సంగటి పుల్లయ్య, యేసు రత్నం, ఓబులేసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా పౌర హక్కుల దినోత్సవం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని కోరారు. సామాజికంగా వివక్షకు గురవుతున్న దళితులకు ఉన్న చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. దళితులను గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం సహాయపడాలని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఇబ్బందులకు గురైన ప్రతి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ కమిటీలు కమిటీలు వేయాలన్నారు. టిడిపి ప్రభుత్వమైనా దళితుల సమగ్ర అభివృద్ధి కోసం తగిన నిధులు కేటాయించాలని కోరారు

నిధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : డిఎంహెచ్ఒ


రోగులకు అందుతున్న వైద్యసేవలను తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ నాగరాజు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -ఖాజీపేట

వర్షా కాలం వల్ల సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి ఎన్. నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తుడమల దిన్నె గ్రామంలో డయేరియా విచారణతో పాటు రోగులకు అందిస్తున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలోనూ జ్వరాలు, లార్వా సర్వేలు చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ట్యాంకుల క్లోరినేషన్ చేపట్టాలన్నారు. జ్వరం వస్తే వెంటనే వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎపిడమాలజిస్ట్ ఖాజా మొహిద్దిన్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, వైద్యురాలు ముబీన్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, స్టాఫ్ నర్స్ సుప్రజ, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డయేరియా బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలో డయేరియా కారణంగా అస్వస్థతకు గురైన బాధిత కుటుంబాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైసిపి నాయకులు వెంకట సుబ్బారెడ్డితో పాటు పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మాజీ శాసనసభ్యులు శెట్టి పల్లె రఘు రామిరెడ్డి సందర్శించి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. డయేరియా కారణంగా మరణించిన బాధిత కుటుంబానికి రూ. 30 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, అగ్రహార సహకార సంఘం మాజీ అధ్యక్షులు రాఘవరెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, అంబటి శివారెడ్డి, సుదర్శన్ రెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాలకు ఎహెచ్‌ఎలు నియామకం

ప్రజాశక్తి - ముద్దనూరు : మండలం లోని వివిధ రైతు సేవా కేంద్రాలకు ఉన్నతాధికారులు ఎహెచ్ఎ (అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు)లను నియమించినట్లు మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. మండలంలోని రాజుల గురువాయపల్లెలో శుక్రవారం పశువైద్యాధికారి ఆధ్వర్యంలో ఎహెచ్‌ఎలకు శిక్షణా కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సందర్శనలో భాగంగా ఎహెచ్‌ఎలకు ఆవులు, గేదెల్లో ఎద సూదుల ప్రాముఖ్యత, చూలు కట్టిందా, లేదా అనే తేడాల గురించి వివరించారు. ఆవులకు,గేదెలకు ఎద సూదులు ఎలా వేయాలని ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. పెనికలపాడు-1,2, కొలవలి, బొందలకుంటా, యామవరం, శెట్టివారిపల్లె గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు ఉన్నతాధికారులు కొత్తగా అనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్లు (ఎహెచ్ఎ)లను నియమించినట్లు చెప్పారు. వీరికి ఆగస్టు 15వరకు కొత్తపల్లె, వేల్పుచెర్ల గ్రామాల్లోని పశు వైద్య కేంద్రాల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం వారు పూర్తిస్థాయిలో ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. వ్యాధి బారిన పడిన వివిధ పశువులకు వైద్యం చేసినట్లు చెప్పారు. గొర్రెలు, మేకలకు నీలి నాలుక (బ్లూ టంగు) టీకాల కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామిరెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, వీరన్నగట్టుపల్లె, ఇడుపులపాయ, అలిరెడ్డిపల్లె సబ్ స్టేషన్‌లకు సంబంధించి ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అలాగే 33/11 తాళ్ళపల్లె ఫీడర్‌లో ఉన్న తాళ్లపల్లె, గిడ్డంగివారిపల్లె, టి. వెలమవారిపల్లె గ్రామాల్లో ఉదయం 8.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు. **చక్రాయపేటలో..** 220 కె.వి చక్రాయపేట సబ్ స్టేషన్ నుంచి వెలువడే 33 కెవి చక్రాయపేట, నాగల గట్టుపల్లె, సిద్ధారెడ్డి గారిపల్లె ఫీడర్లలో మరమ్మతుల కారణ:గా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 .30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎఇఇ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి పరిధిలోని చక్రాయపేట, మహాదేవపల్లి, కె.రాజుపల్లి, కె.ఎర్రగుడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సంస్థకుసహకరించాలని పేర్కొన్నారు. **ఎర్రగుంట్లలో..** మండల పరిధిలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు, లైన్లపై ఉన్న చెట్టు కొమ్మలను తొలగింపు వంటి పనులు చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎడి కిరణ్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించాలన్నారు. **మైదుకూరులో..** మండల పరిధిలో 33 కెవి, 11 కె.వి విద్యుత్ లైన్ల మరమ్మతులనేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మైదుకూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు అంతరాయం సమయం తెలుసుకొని విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు. **ముద్దనూరులో..** విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాసరాజ వర్మ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఒప్పంద ఉద్యోగుల ప్రతినిధి యు.రాజేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్‌నాయుడును పొట్లదుర్తిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి మాట్లాడుతూ పదేళ్ల నుంచి కళాశాలలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు.ఎలాంటి ఎదుగూ బొదగూ లేకుండా జీవితాలు గడుపుతున్నామన్నారు. సరైన సమయానికి జీతాలు అందడంలేదన్నారు. కళాశాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలపై ఎంపీ సానుకూలముగా స్పందించారని చెప్పారు.